క్లుప్తంగా

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంఈఓ స్వరూప

బనగానపల్లె రూరల్: రెండవ విడత కింద మండలానికి 1,148 ట్యాబ్‌లు మంజూరైనటుల ఎంఈఓ స్వరూప తెలిపారు. సోమవారం పలు పాఠశాలల హెచ్‌ఎంలకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ట్యాబ్‌లను విద్యార్థులు సక్రమంగా వినియోగించుకునేలా చూడాలని హెచ్‌ఎంలకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు బాలంగంగధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలి

- ఆర్‌టీఓ క్రాంతికుమార్



మాట్లాడుతున్న ఆర్‌టీఓ క్రాంతికుమార్

డోన్ రూరల్: త్వరలో జరగనున్న జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలని ఆర్‌టీఓ క్రాంతికుమార్ వలంటీర్లకు సూచించారు. స్థానిక ఆర్‌టీఓ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన వలంటీర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఘనంగా యాగంటి ఉమా మహేశ్వరుల పల్లకీ సేవ



శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి పల్లకీసేవ కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఆలయ కార్యనిర్వాహణాధికారిచంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తోట బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు అభిషేకం అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో కొలువైన శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ముస్తాబు చేసి, ఆలయ చుట్టూ పల్లకీసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ సమీపంలోని నంద్యాల రహదారిలో అయ్యప్ప స్వామి ఆలయం ఎదురుగా నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ముద్దవరం మద్దయ్య, సభ్యులు వెంకటయ్య, నారాయణ ఆధ్వర్యంలో నాయీ బ్రాహ్మణ కమిటీ హాల్ నిర్మాణానికి ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ట్రయల్ రన్ విజయవంతం



బుగ్గానిపల్లె తండా వద్దకు చేరుకున్న గోరుకల్లు రిజర్వాయర్ నీరు

బేతంచెర్ల: పాణ్యం మండలం గోరుకల్లు రిజర్వాయర్ నుంచి డోన్ నియోజకవర్గంలోని ప్రజలకు శాశ్వత ప్రాతిపదికన రూ.350 కోట్లతో వాటర్ గ్రిడ్ పథకం కింద తాగునీటి సరఫరా చేసేందుకు పైప్‌లైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సోమవారం ట్రయల్ రన్ నిర్వహించగా బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లె తండా వద్ద ఉన్న ట్రీట్ మెంట్ ప్లాంట్ వరకు నీరు చేరుకుంది. ఈనెల 29న బేతంచెర్ల పట్టణానికి పూర్తి స్థాయిలో నీటిని అందించేందుకు ఇంజినీరింగ్ అధికారులు పనులను శరవేగంగా కొనసాగిస్తున్నారు.

మహిళా ఓటర్లే అధికం

డోన్ టౌన్: నియోజకవర్గంలో 2,24,113 మంది ఓటర్లు ఉన్నట్లు తహసీల్దార్ విద్యాసాగర్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ నియోజకవర్గంలోని పురుషులు 1,10,458, మహిళలు 1,13,586, ఇతరులు 69 మంది ఉన్నారన్నారు. కాగా పురుషుల కంటే మహిళా ఓటర్లు 3128మంది ఎక్కువగాఉన్నట్లు తెలిపారు.

జై శ్రీరాం..జై శ్రీరాం.. రాజారాం

- రామనామ స్మరణతో మారుమ్రోగిన పల్లెలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- అన్నదానం, పానకం పంపిణీ తదితర సేవాకార్యక్రమాలు

మిన్నంటిన జై శ్రీరాం నినాదాలు ఒకపక్క.. రామనామ జపాలు మరోపక్క.. కాషాయ జెండాల రెపరెపలు ఇంకోపక్క.. ఇలా సోమవారం వాడవాడలా భక్తిభావం ఉప్పొంగిది. అయోధ్య రామమందిరంలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా బనగానపల్లె నియోజకవర్గమంతా రామ నామంతో మారుమ్రోగింది. ఉదయమే పుణ్యస్నానాలాచరించి కుటుంబ సమేతంగా ఆలయాలకు చేరుకున్న భక్తులు రామ నామ జపంతో పూజల్లో పాల్గొన్నారు. పలు చోట్ల ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయడంతో అయోధ్య నుంచి ప్రత్యక్ష ప్రసారాన్ని చూసి తరించిపోయారు. కొందరు భక్తులకు అన్నదానం చేయగా మరికొందరు బెల్లం పానకం, గుగ్గిళ్లు పంచిపెట్టి తమ వంతుగా సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. – కొలిమిగుండ్ల



ఎల్ఈడీ స్క్రీన్‌లో అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని తిలకిస్తున్న భక్తులు



డోన్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



కోలాహలంగా స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల మండలంలోని పలు పల్లెల్లో పండుగ వాతారణం నెలకొంది. చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ శ్రీరాముడిని స్మరిస్తూ తన్మయత్వం పొందారు. అంకిరెడ్డిపల్లెలోని రామాలయంలో సీతారాముల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాములోరి కల్యాణాన్ని తిలకించేందుకు మహిళలు అధిక సంఖ్యలో వచ్చారు. తిరుపతి నుంచి వచ్చిన లడ్డూ తయారీదారులతో చేయించిన లడ్డూను భక్తులకు పంపిణీ చేశారు. అలాగే నగర సంకీర్తనలు, గ్రామోత్సవాలు, భజన కార్యక్రమాలతో ఊరూవాడా భక్తిపారవ్యంతో పరవశించిపోయాయి.

ఊరూరా రాములోరి సంబరం

కోవెలకుంట్ల: అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో వెలసిన రామాలయాల్లో విగ్రహ ప్రతిష్ఠా సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కోవెలకుంట్ల పట్టణంలో సీతారామనగర్, సంతపేట, పాటిమీద ఆంజనేయస్వామి, సత్యనారాయణస్వామి దేవాలయాలతో పాటు మండలంలోని గుళ్లదూర్తి, కంపమల్ల, అమడాల, వెలగటూరు, సౌదరదిన్నె, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో రామనామ సంకీర్తనలు మిన్నంటాయి. ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అభిషేకాలు, విశిష్టపూజలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కాలనీలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అయోధ్యలో జరిగే మహోత్సవాన్ని వీక్షించేందుకు పలు ఆలయాల ఆవరణాల్లో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఆకట్టుకున్న రాములోరి ఊరేగింపు

అవుకు: అయోధ్య బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా అవుకు మండలం రామ నామస్మరణతో మారుమ్రోగింది. అవుకు చాకలి పేటలోని సీతారామాంజనేయ స్వామి, బెస్త వీధిలోని శ్రీరామాలయాల్లో ఆలయాల కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. స్వామివారిని దర్శించుకోవటానికి భక్తులు భారీగా తరలివచ్చారు. సాయంత్రం చెన్నకేశవ స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో స్వామివారి ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అవుకు మదర్ మోడల్ స్కూల్ విద్యార్థుల కోలాటం ఆకట్టుకుంది.

బనగానపల్లెలో..

బనగానపల్లె: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మండలం వ్యాప్తంగా సంబరాలు అంబరాన్నంటాయి. పలు సీతారాముల ఆలయాల్లో రామనామ స్మరణ సంకీర్తనలు మిన్నంటాయి. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన పూజ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కాటసాని ప్రసాదరెడ్డి, సతీమణి సులోచన పాల్గొని పూజలు చేశారు. మంగళవారం పేటలోని రామాలయంతో పాటు పలు రామాలయాల్లో వేడుకలు భక్తిభవంతో నిర్వహించారు.

డోన్‌లో..

డోన్/టౌన్: అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని రామాలయాలు, హనుమాన్ దేవాలయాల్లో సోమవారం పండుగ వాతావరణం నెలకొంది. పలు ఆలయాల్లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లలో అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించారు. యజ్ఞాలు, యాగాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని వేంకటేశ్వర ఆలయం, శ్రీరాముల ఆలయం, కొండమీది వీరాంజనేయ స్వామి, పాతపేట బాల ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు అఖండ భజన కార్యక్రమాలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో, పాతపేట రాములదేవాలయంలో రామ భక్తులు, పాత బస్టాండ్‌లో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పాత బస్టాండ్‌లో వేలాది మందికి స్ఫూర్తి సేవా సమితి సభ్యులు అన్నదానం చేశారు.

వాడవాడలా రామనామం

ప్యాపిలి: అయోధ్య రామాలయంలో సోమవారం బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ప్యాపిలి మండలంలోని అన్ని గ్రామాల్లో రామనామం మార్మోగింది. మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం నుంచి సీతారాముల చిత్రపటాలకు పల్లకీసేవ నిర్వహించారు. జై శ్రీరామ్ నినాదాలతో పట్టణ ప్రధాన వీధుల మీదుగా పల్లకీసేవ శోభాయమానంగా సాగింది. ఆర్యవైశ్యులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రముఖ దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రామ్‌లల్లా విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ ముగిసేవరకు పలు గ్రామాల్లో ప్రజలు ఉపవాసాన్ని పాటించారు.

బేతంచెర్లలో..

బేతంచెర్ల: అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని బేతంచెర్ల పట్టణంలో సోమవారం శోభాయాత్ర కనుల పండువగా నిర్వహించారు. అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు ఆంజనేయ స్వామి ఆలయం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన రథంపై సీతారాముల ఉత్సవ విగ్రహాలను కొలువుంచి శ్రీరామ జై, సీతారామ జై, రామ భక్త హనుమాన్‌కు జై అంటూ పాతబస్టాండు, కొత్తబస్టాండు, హనుమాన్ నగర్, సంజీవనగర్, రైల్వే గేట్, దుర్గాపేట, బోయపేట మీదుగా ఆంజనేయ స్వామి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. భక్తులకు బేతంచెర్ల రెడ్డి సంక్షేమ సంఘం పానకం పంపిణీ చేసింది. అయ్యప్ప స్వామి ఆలయం నుంచి శ్రీరామ, ఆంజనేయ, ఛత్రపతి శివాజీ జెండాలతో ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు. అమ్మవారి శాలలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. సిమెంట్ నగర్ గ్రామంలోని అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేయగా మహిళలు శ్రీరామ, ఆంజనేయస్వామి ముగ్గులేసి తమ భక్తిని చాటుకున్నారు. ఆర్ఎస్ రంగాపురం, అంబాపురం, ముద్దవరం, ముసలాయిచెర్వు గ్రామంలో శ్రీరామ మందిర ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.



ప్రతిష్ఠ చేసిన పట్టాభిరాముడి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం



స్వామిని దర్శించుకునేందుకు గుమికూడిన భక్తులు

భక్తిశ్రద్ధలతో పట్టాభిరాముడి విగ్రహ ప్రతిష్ఠ

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కోర్నపల్లె సమీపంలో పురాతన గుండం ఆంజనేస్వామి ఆలయ సమీపంలో పట్టాభి రాముడి విగ్రహ సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయోధ్య రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సమయానికే ఇక్కడ పట్టాభి రాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠ చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని విగ్రహ ప్రతిష్ఠ అనంతరం స్వామిని దర్శించుకున్నారు. ఏకశిలపై సీతారాములతో పాటు లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు, ఆంజనేయుడు, బ్రహ్మ, సరస్వతి, వినాయకుడు, నారద, సూర్య భగవానుడి రూపాలు ఇందులో ఉంటాయి. ఏకశిలలో 12 మంది దేవతామూర్తులతో కూడిన విగ్రహాన్ని ప్రతిష్ఠించిన ఆలయాలు అరుదుగా ఉంటాయి. ఆళ్లగడ్డకు చెందిన కళాకారులు తిరుమల సంజీవ, చిరంజీవ ఏక శిలను తయారు చేశారు. పూజల్లో ఆలయ కమిటీ పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇటిక్యాల బాలిరెడ్డి, శేఖర్‌రెడ్డి, అనంతపురం జిల్లా బీజేపీ అధ్యక్షులు అంకాల్‌రెడ్డి, పెన్నాసిమెంట్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



బేతంచెర్ల: ముసలాయిచెర్వు గ్రామంలో సీత, రామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలు



కోవెలకుంట్లలో శ్రీరాముల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పాటిమీద ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం



అవుకు సీతారాంజనేయ స్వామి ఆలయంలో భక్తుల అన్నదానం చేస్తున్న దృశ్యం



బనగానపల్లె ఆంజనేయస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



డోన్ పాత బస్టాండ్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం



ప్యాపిలిలో పల్లకీసేవ



అవుకు: బెలుంలో అన్నదానం



బేతంచెర్ల: శోభాయాత్రను ప్రారంభిస్తున్న దృశ్యం



ప్యాపిలి: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్యవైశ్యుల .



బేతంచెర్లలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు పానకం పంపిణీ

ఆధ్యాత్మిక భావనలు పెంపొందించుకోవాలి

డోన్ టౌన్: మానసిక అశాంతి, అలజడిని అధిగమించడానికి ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనలు పెంపొందించుకోవాలని శతావధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ అన్నారు. పట్టణ సమీపంలోని కొండపై వెలసిన ద్రోణపురి తిరుమల వీరాంజనేయస్వామి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన గిరి ప్రదక్షిణ, మెట్ల మార్గాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. డోన్‌కు చెందిన మాణిక్య ప్రభు సేవా సమితి సభ్యులు దేవస్థాన ప్రాంగణంలో తూర్పు వైపు గిరి ప్రదక్షిణ మార్గం నుంచి ఆలయం వరకు మెట్లను నిర్మించారు. కొండపై రూ.15 లక్షలతో నూతనంగా సీతారామ కల్యాణ మండపం భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం అయోధ్య బాలరామ ప్రతిష్ఠ మహోత్సవం పురస్కరించుకుని అనుగ్రహ భాషణం చేశారు. కారన్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, మాణిక్య ప్రభు సేవా సమితి సభ్యులు ఉన్నారు.



మెట్ల మార్గాన్ని ప్రారంభిస్తున్న దత్తాత్రేయశర్మ

రచ్చకెక్కిన 'తమ్ముళ్లు'

- డోన్ టీడీపీ అభ్యర్థి తమ నాయకుడంటే ..తమ నాయకుడేనని సోషల్‌మీడియాలో ప్రచారం

డోన్: నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీలో అసమ్మతి నేతల రచ్చ మొదలైంది. స్వయంగా ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడే డోన్ నుంచి ధర్మవరం సుబ్బారెడ్డే ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటాడని ప్రకటించినా.. కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, కేఈ కృష్ణమూర్తి వర్గీయులు వ్యతిరేకించారు. సుబ్బారెడ్డి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ అసమ్మతి నేతలు కేఈ, కోట్ల వర్గీయులు నియోజకవర్గమంతటా కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. పార్టీ అభ్యర్థి ఎంపిక విషయంలో నియోజకవర్గ స్థాయి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించకుండా టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్న వారి మనోభావాలు తెలుసుకోకుండా, తరచూ పార్టీలు మారే వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ ఎలా ఇస్తారని కోట్ల, కేఈ వర్గీయులు చంద్రబాబును నిలదీస్తున్నారు. డోన్ ఇన్‌చార్జ్ అభ్యర్థిత్వానికి చెక్ పెట్టేలా ఒకవైపు కేఈ కుటుంబీకులతో పాటు కోట్ల కుటుంబం కూడా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. మరోవైపు టీడీపీలో రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులుగా చెప్పుకుంటున్న ప్యాపిలి మండలానికి చెందిన టీడీపీ నాయకుడు తెరపైకి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి పేరును పథకం ప్రకారం తీసుకువస్తున్నట్లు సుబ్బారెడ్డి వర్గీయులు ఆరోపిస్తున్నారు. కోట్ల, కేఈ కుటుంబాల ప్రమేయం లేకుండా పార్టీ ఇన్‌చార్జ్ పదవిని పొందిన సుబ్బారెడ్డి ప్రస్తుతం తీవ్ర డైలామాలో పడిపోయారు. ఈ విషయంపై ధర్మవరం సుబ్బారెడ్డి, కోట్ల, కేఈ అభిమానుల మధ్య సోషల్ మీడియాలో దూషణల పర్వం కొనసాగుతుండటంతో డోన్ నియోజకవర్గ టీడీపీ రాజకీయం రసకందాయంలో పడింది.

హక్కులను సాధించుకుందాం

డోన్ టౌన్: మాదాసి, మాదారి కురువలు సమష్టిగా ఉండి ఎస్సీ ధ్రువపత్రాలను సాధించుకుందామని సంఘం రాష్ట్ర కోశాధికారి కేసీ మద్దిలేటి, డోన్ మండల గౌరవ సలహాదారు గంగన్న, రంగనాథమయ్య, మల్లికార్జున అన్నా రు. సోమవారం కొత్త బస్టాండ్ సమీపంలో నూతన కార్యాలయాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కుల గణనలో ఎస్సీలుగా నమో దు చేయించుకోవాలని సూచించారు. త్వరలో జగరబోయే ఎన్నికల్లో మాదాసి, మదారి కురవలను ఎస్సీలుగా గుర్తించిన వారికే తమ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు స్పేర్‌పార్ట్స్ ప్రసాద్, మునిస్వామి, శివలింగం, బాలమద్దయ్య, న్యాయ సలహాదారులు లక్ష్మన్న, పక్కీరప్ప నాయకులు వెంకటరమణయ్య, ఓబులేసు, బాబు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

స్టాటర్ చోరీ

డోన్ రూరల్: మండల పరిధిలోని బొంతిరాళ్ల గ్రామం వద్ద రిటైర్డ్ జడ్జి బుద్ద నాగేంద్రరావు పొలంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని దొంగలు మోటార్‌కు ఉన్న స్టాటర్‌ను చోరీ చేశారు. రూ.6 వేల విలువ చేసే స్టాటర్ చోరీకి గురైందని బాధితుడు ఫిర్యాదు చేసినట్లు సోమవారం పోలీసులు తెలిపారు.

24న ఆసరా వారోత్సవాలు

కోవెలకుంట్ల: స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో ఈనెల 24న నిర్వహించ తలపెట్టిన వైఎస్సార్ ఆసరా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఈఓపీఆర్‌డీ రాధిక, మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సచివాలయాల సిబ్బంది, వలంటీర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ గోపినాథ్ పాల్గొన్నారు.

సర్పంచ్‌కు గాయాలు

పత్తికొండ రూరల్: పెండ్లిమాన్ తండా సర్పంచ్ లక్ష్మానాయక్ బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మోటార్ సైకిల్ ఢీకొట్టడంతో తలకు గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలించారు.

వైఎస్సార్‌బీమా పేదలకు వరం

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌బీమా పథకం పేదలకు వరమని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. మీర్జాపురం గ్రామానికి చెందిన పిక్కిలి లక్ష్మి, మార్కె రమణయ్య ఇటీవల సహజ మరణం చెందడంతో వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష చొప్పున మంజూరైంది. సొమ్మును బాధిత కుటుంబ సభ్యులు వెంకట నిఖిల్, లక్ష్మీదేవిలకు సోమవారం జెడ్పీ చైర్మన్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు పేరం సత్యనారాయణ రెడ్డి, నందిపాడు, బిఉప్పలూరు సర్పంచులు గుర్విరెడ్డి, ఈశ్వరయ్య, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఇశ్రాయెల్ పాల్గొన్నారు.



బీమా సొమ్ము అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కులగణనను పక్కాగా నిర్వహించాలి



కులగణన ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి

అవుకు: కులగణన ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు నిర్వహిస్తున్న కులగణన సర్వేను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే వివరాలను తప్పుల్లేకుండా నమోదు చేయాలన్నారు. కుటుంబ సభ్యుల వివరాలు, చిన్నపిల్లలు, పశువులు, ఇతరత్రా సమాచారం సేకరించి ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో పొందుపరచాలన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్, ఈఓఆర్‌డీ రామకృష్ణవేణి పాల్గొన్నారు.

వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాబుల్ రెడ్డి ప్రమాణ స్వీకారం

బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు సురేంద్రనాథ్‌రెడ్డి (బాబుల్ రెడ్డి) రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా విజయవాడలో ఎండీ ఓంకార్ రెడ్డి, చైర్మన్ కరిముల్లా ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా ఆయన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కర్నూలు నుంచి డోన్‌కు రాత్రి పల్లె వెలుగు బస్సు

డోన్ టౌన్: ప్రయాణికుల సౌకర్యార్థం కర్నూలు నుంచి డోన్‌కు రాత్రి 9 గంటలకు పల్లె వెలుగు బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శశిభూషణ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గతంలో చివరి పల్లె వెలుగు బస్సు కర్నూలులో రాత్రి 8.30 గంటలకు ఉండేదని తరువాత అన్నీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉండటంతో చాలా మంది గ్రామీణ ప్రాంత ప్రజలు, విద్యార్థులు, దినసరి కూలీలు ఇబ్బంది పడుతున్న దృష్ట్యా ఈ బస్సును ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. సోమవారం నుంచి అదనంగా మరో బస్సు 9 గంటలకు కర్నూలు కొత్త బస్టాండ్ నుంచి బయలుదేరి వయా వెల్దుర్తి మీదుగా డోన్‌కు వస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
డోన్, బనగానపల్లె
90100 55532 (డోన్)
99122 20581 (బనగానపల్లె)
Office mail : sakshiknladvt@gmail.com